బుధ వారం
27-12-2023
సంపుటి - 08,
సంచిక - 416
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు వార్త పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole


# తెలంగాణలో నేడే సింగరేణి ఎన్నికలు

## ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్

## 11 ఏరియాల్లో 84 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు


3వ పేజీలో...

**కొత్తగూడెం, డిసెంబర్ 26 (సమ సమాజం):** తెలంగాణలో సింగరేణి ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. బుధవారం జరిగే ఎన్నికలకు భాఈగా ఏర్పాట్లు చేశారు. సింగరేణి ప్రాంతంలోని 11 ఏరియాల్లో 84 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి. 13 కార్మిక సంఘాలు పోటీ పడుతున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో... 39వేల మంది బొగ్గుగని కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 650 మంది ఎన్నికల్లో విధుల్లో పాల్గొంటుంటే, 460 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ఉంటుంది. 2021 అక్టోబరులో ఎన్నికలు జరగాల్సి ఉన్నా, ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు చూపలేదు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలు జరుగుతున్నాయి. అక్టోబర్ 30న పోలింగ్ జరగాల్సి ఉన్నా, అసెంబ్లీ

# దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న మోడీ

## మోడీ, అమిత్‌షాల విధానాలు చేటు

### బిజెపిది రిమినల్ గవర్నమెంట్

### ఆదానీకి కట్టబెడుతున్న దేశ సంపద

### సిపిఐ 99వ వార్షికోత్సవంలో లెఫ్ట్ నేతల మండిపాటు


3వ పేజీలో...

**హైదరాబాద్, డిసెంబర్ 26 (సమ సమాజం):**దేశాన్ని మోదీ ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తుంటే చూస్తూ ఊరుకోమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నారు. మనుధర్మాన్ని అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్‌తో పాటు విచారణ సంస్థలను

# ప్రధాని మోడీని కలిసిన సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి

## రాష్టానికి సంబంధించి పలు అంశాలు వెల్లడి



నిధులు విడుదల చేసి ఆదుకోవాలని వినతి ● సానుకూలంగా స్పందించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26 (సమ సమాజం):** తెలంగాణ అభివృద్ధికి సహకరించాల్సిందిగా ప్రధాని మోడీని సిఎం ఏవంత్ రెడ్డి కోరారు. నిధులు విడుదల చేసి ఆదుకోవాలని అన్నారు. ఈ మేరకు డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కతో కలసి ఆయన ఢిల్లీలో ప్రధానిని ఆమన నివాసంలో కలుసుకుని వినతిపత్రం సర్పించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత తొలిసారి ముఖ్యమంత్రి హోదాలో ప్రధాని మోదీని రేవంత్ రెడ్డి కలిశారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా ఉన్నారు. తెలంగాణ సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు ఇప్పటికే కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా పలు సంక్షేమ పథకాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇక కేంద్రం నుంచి రావల్సిన నిధులు, పాత బకాయిలు, పెండింగ్ లో ఉన్న బిల్లులపై చర్చించారు. రేవంత్ రెడ్డి చెప్పిన వాటిని తప్పకుండా అమలు చేస్తామని మోదీ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. విభజన హామీకి సంబంధించిన పెండింగ్ నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల మంజూరు కోసం కేంద్రాన్ని అభ్యర్థించారు. రాష్ట్ర పురోగతికి అవసరమైన విన్నపాల జాబితా పట్టుకుని రేవంత్, విక్రమార్క ఢిల్లీకి వెళ్లారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు రాష్ట్రానికి రావాల్సిన వివిధ రకాల గ్రాంట్లు, పెండింగ్ నిధుల గురించి ప్రస్తావించినట్లు తెలుస్తోంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పథకం కింద రాష్ట్రానికి నిధులు రావాల్సి ఉంది. ఈ పథకం కింద హైదరాబాద్ మినహా అప్పటి ఉమ్మడి తొమ్మిది జిల్లాలకు 50 కోట్ల చొప్పున 450 కోట్లు రావాల్సి ఉంది. గత మూడేళ్లకు సంబంధించి 1,350 కోట్ల రూపాయల గ్రాంటు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని విడుదల చేయాలని ప్రధాని మోదీని, సీఎం రేవంత్ కోరినట్లు తెలుస్తోంది. అలాగే కృష్ణా జలాల పంపకాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. ఎందుకంటే తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగుతున్న క్రమంలో అటు ఏపీ, ఇటు

3వ పేజీలో...

# వారిద్దరూ చెమట కక్కి సంపాదించారా

## అప్పులు తీర్చాలంటే ప్రజలు స్వేదం చిందించాలి

### బిఆర్ఎస్ స్వేదపత్రంపై భట్టి విమర్శలు


3వ పేజీలో...

**హైదరాబాద్, డిసెంబర్ 26 (సమ సమాజం):** ప్రభుత్వ శ్వేత పత్రానికి కౌంటర్ పేరిట.. బీఆర్ఎస్ స్వేద పత్రం రిలీజ్ చేయడంపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘాటు విమర్శలు చేశారు. బావ, బావ మరది చెమట కక్కి సంపాదించారా? అని కేటీఆర్, హరీష్‌రావులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటన ముందుకు ఆయన ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో మాట్లాడారు. 'ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ స్వేద పత్రం అంటూ రిలీజ్ చేశారు. ఆ బావ, బావ మరిది వాళ్లేదో కష్టపడి చెమట చిందించి

# వెహికల్ చలాన్లపై రాయితీ

## అమల్లోకి తెస్తూ ప్రభుత్వం జీవో జారీ


3వ పేజీలో...

# భారత వాణిజ్య నౌకలపై దాడిని ఉపేక్షించం

## సముద్ర దొంగలు ఎక్కడ దాక్కున్నా వదలబోం

## దాడి చేసిన వారు సముద్రంలో దాక్కున్నా పట్టుకుంటాం

## కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ స్పష్టీకరణ




**ముంబయి, డిసెంబర్ 26 (సమ సమాజం):** భారత్‌కు వస్తోన్న వాణిజ్య నౌకలపై ఇటీవల జరిగిన దాడులను కేంద్రం తీవ్రంగా పరిగణించినట్లు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. నౌకలపై వరుస దాడుల నేపథ్యంలో సముద్ర జలాల్లో గస్తీని ముమ్మరం చేసినట్లు వెల్లడించారు. ఈ దాడులకు పాల్పడిన వారు సముద్రంలో ఎక్కడ దాక్కున్నా.. వేటాడి, పట్టుకుంటామని స్పష్టం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన యుద్ధనౌక 'ఐఎన్ఎస్ ఇంఫాల్ ను ముంబయి వేదికగా

3వ పేజీలో...

# పార్లమెంట్ ఎన్నికల వరకు కాంగ్రెస్‌కు అనుకూలమే

## ఇప్పటికిప్పుడు బిఆర్ఎస్‌కు కలిసి వచ్చే పరిస్థితి లేనట్లే




**హైదరాబాద్, డిసెంబర్ 26 (సమ సమాజం):** వచ్చే పార్లమెంట్ ఎన్నికల వరకు ప్రజల్లో ఊపు కొనసాగించేలా కాంగ్రెస్ పక్కా ప్లాన్‌తో వెళుతోంది. గెలిచిన ఊపును కొనసాగిస్తూనే ఎంపి ఎన్నికల్లో వీలైనన్న ఎక్కువ సీట్లు దక్కించుకునే ప్రయత్నంలో ఉంది. ఈ క్రమంలో ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేసే బృహత్తర కార్యక్రమం నిత్యం ప్రజల్లో కొనసాగేలా ప్రణాళికలు రచిస్తోంది. దీనికితోడు కెసిఆర్‌పై ఉన్న వ్యతిరేకత ఇప్పటికిప్పుడు చల్లారక పోవచ్చు. కెటిఆర్ ఎన్ని ప్రజెంటేషన్లు ఇచ్చినా ప్రజల్లో నమ్మకం కలగదు. దానికి కొంత సమయం పడుతుంది. అప్పటి వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ హవా సాగనుంది. ఈ క్రమంలో పా÷-లమెంట్ ఎన్నికలు కూడా కాంగ్రెస్‌కు అనుకూలంఆనే ఉంటాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు అనేకులను బిఆర్ఎస్ వదులుకుంది. కొందరిని ఇతర పార్టీల నుంచి బలవంతంగా రప్పించుకుంది. అయితే వాడుకుని వదిలేసే రకం అన్న పేరు కెసిఆర్‌కు ఉంది. కెసిఆర్‌తో ఉద్యమ సమయంలో ఉన్న

3వ పేజీలో...

# పారిశ్రామికాభివృద్ధిని కొనసాగిస్తాం




## ఫాక్స్‌కాన్ ప్రతినిధులకు సిఎం రేవంత్ హామీ

**హైదరాబాద్, డిసెంబర్ 26 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అభివృద్ధిలో రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలబెడతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని.. ఫాక్స్‌కాన్ సంస్థ తెలంగాణలో చేపట్టబోయే భవిష్యత్ ప్రాజెక్టులకు కూడా అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. తెలంగాణ సచివాలయంలో సీఎం

3వ పేజీలో...




# గురుగోవింద్ సింగ్ పోరాటం గొప్పది

**వారి కుమారుల పోరాటం చరిత్రాత్మకం**

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్య**

హైదరాబాద్,డిసెంబర్ 26 (సమ సమాజం): గురుగోవింద్ సింగ్ పోరాటం చాలా గొప్పదని.. వారి కుమారుల పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానిం చారు. మంగళవారం నాడు వీర్ బాల్ దినోత్సవం సందర్భంగా అమీర్‌పేటలోని గురుద్వార్‌ను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... పదో సిక్కు గురువు గురు గోవింద్ సింగ్ కుమారులైన.. బాబా జోరావర్ సింగ్ (9 ఏళ్లు), బాబా ఫతే సింగ్ (6 ఏళ్లు) ధర్మ కోసం బలిదానం అయ్యారని.. వారి పెద్ద కుమారులు సైతం మొఘల్ సైన్యంతో పోరాటం చేసి ధర్మం కోసం బలిదానం చేశారని చెప్పారు. చివరకు గురుగోవింద్ సింగ్ ఇద్దరు పుత్రులు కూడా ఔరంగజేబు సైన్యం బంధించి సిక్కు మతం నుంచి ఇస్లాం మతంలోకి మారాలని ఒత్తిడి చేసిందన్నారు. ఇస్లాంను స్వీకరించాలి, సిక్కు మతాన్ని వదిలేయాలని అనేక రకాలుగా వేధింపులకు, దౌర్జన్యాలకు గురిచేశారని కిషన్‌రెడ్డి తెలిపారు. మతం మారే ప్రసక్తే లేదని ఆ ఇద్దరు పసిపిల్లలు ఔరంగజేబుకు, మొఘల్ సైన్యానికి సవాల్ విసిరారని చెప్పారు. చివరకు ఆ ఇద్దరు పసిపిల్లలను నిర్దాక్షిణ్యంగా ప్రాణాలతో సమాధి చేసి వారిని బలిగొన్నారని.. వారి త్యాగనిరతికి స్ఫూర్తిగా డిసెంబరు 25వ తేదీన ఢిల్లీలో కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'వీర బాల్ దివస్' నిర్వహించాలని దేశమంతా వేలాది కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. దేశంలోని చాలామంది మంత్రులు, ముఖ్యమంత్రులు, శాసనసభ్యులు అనేక ప్రాంతాల్లో గురుద్వార్‌కు వెళ్లి శ్రద్ధాంజలి ఘటిస్తున్నారని గుర్తుచేశారు. వీర పోరాటంలో మరణించిన వీర బాలలకు ఈరోజు నివాళులర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నానని కిషన్‌రెడ్డి అన్నారు. గురుగోవింద్ సింగ్ చేసిన పోరాటం గురించి ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసి వీడియోల ద్వారా కేంద్ర ప్రభుత్వం వివరిస్తోందని తెలిపారు. విదేశీయులతో, ఆక్రమణ దారులతో పోరాటం చేసిన గురుగోవింద్ సింగ్, వారి తనయులను మనందరం కూడా స్మరించు కోవాలని... వారి స్ఫూర్తితో దేశ అభివృద్ధి కోసం ముందడుగు వేయాలని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# అట్టహాసంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

## నల్లపాడులో జ్యోతి వెలించి ప్రారంభం

**దేశ చరిత్రలో మైలురాయిగా నిలిచేలా క్రీడలు**

**ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులను ఎంపిక చేయడమే లక్ష్యం**

**ఫిబ్రవరి 10 వరకు క్రీడల నిర్వహణ**

**అన్నిరకాలుగా ప్రోత్సహిస్తామన్న సిఎం జగన్**



అమరావతి,డిసెంబర్ 26 (సమ సమాజం): ఆడుదాం ఆంధ్రా పోటీలను సీఎం జగన్ ప్రారంభించారు. గుంటూరు జిల్లా నల్లపాడులోని లయోలా కాలేజీలో వీటిని ప్రారంభించారు. క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం మాట్లాడిన జగన్... ఈ స్పోర్ట్స్ ఈవెంట్ దేశ చరిత్లోనే మైలురాయిగా చెప్పుకోవచ్చన్నారు. 47 రోజుల పాటు అందరూ పాల్గొనే గొప్ప క్రీడల పండుగ అని అన్నారు. ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో ఉపయోగ పడతాయని బీపీ, షుగర్ అదుపులో ఉంటాయని తెలిపారు. అనంతరం ఆడుదాం ఆంధ్రలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ కిట్స్‌ను పరిశీలించారు. ఈరోజు నుంచి మొదలవుతున్న ఈ క్రీడా సంబరాలు దేశ చరిత్రలోనే ఒకమైలు రాయిగా నిలబడిపోతుందని చెప్పడానికి గర్వపడుతున్నానని అన్నారు. ఫిబ్రవరి 10వ తేదీ దాకా ఊరూరా పండుగ వాతావరణంలో జరుగుతుందన్నారు. ఇవి అందరూ పాల్గొనే ఒక గొప్ప పండుగగా చిత్రలో నిలబడిపోతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రెండు ప్రధానమైన ఉద్దేశాలు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా అచీవ్ చేయాలని ప్రయత్నిస్తోందన్నాఉ. ప్రతి ఊరిలోనూ జరిగే ఈ కార్యక్రమం ప్రతి ఊర్లోనూ వ్యాయామం, స్పోర్ట్స్ వల్ల ప్రతి మనిషి ఆరోగ్యానికి ఎంత మేలు జరుగుతుందన్న విషయం ఒక అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌గా ఉపయోగపడుతుందన్నారు. ఆరోగ్యం సరిగా ఉండాలంటే మన జీవితాల్లో క్రీడలు ఎంత అవసరం అని తెలియజెప్పడానికి ఒక క్యాంపెయిన్‌గా ఉపయోగపడుతుంది. క్రమం తప్పకుండా కచ్చితంగా వ్యాయమం చేయడం వల్ల బ్లడ్ ప్రజర్‌లాంటివి కంట్రోల్‌లో ఉంచగలుగుతాం. డయాబెటిస్ లాంటివి నిరోధించడంలో క్రియాశీలకంగా స్పోర్ట్స్ పని చేస్తుంది. విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ హెల్త్ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా గ్రామ స్థాయిలోనే ప్రివెంటివ్ కేర్‌మీద దేశం మొత్తం గర్వపడేలా ఎప్పుడూ పడని అడుగులు మన రాష్ట్రంలో పడుతున్నాయని అన్నారు. ఇందులో భాగంగానే వ్యాయామం ఎంతో అవసరం అన్నది కూడా గ్రామస్థాయిలోకి మెసేజ్ తీసుకొనిపోయే గొప్ప కార్యక్రమం ఇదని సిఎం అన్నారు.రకరకాల జబ్బులు కంట్రోల్‌లో ఉండాలంటే గ్రామస్థాయిలో వ్యాయామం, స్పోర్ట్స్ అన్నది ఎంతో అవసరమైన కార్యక్రమంగా ప్రభుత్వం గట్టిగా భావిస్తోంది. గ్రామస్థాయి నుంచే ఈ కార్యక్రమానికి అడుగులు వేగంగా వేయిస్తున్నామని అన్నారు. మండలస్థాయి, నియోజకవర్గ స్థాయి, దాని తర్వాత జిల్లా స్థాయి, దాని తర్వాత రాష్ట్ర స్థాయిలో పోటీలన్నీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉద్దేశం గ్రామాల్లో ఉన్న ఆణిముత్యాలను వెతకడం అన్నారు. దేశానికి ఉత్తమ క్రీడాకారులను అందించడం లక్ష్యమని అన్నారు. ఆ పిల్లలకు తోడ్పాటు ఇచ్చేందుకు, సాయంగా ఉండేందుకు వెతికే కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి తోడుగా ఉంటూ ఆణిముత్యాలుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగస్వాములు కావడానికి టీములు ముందు కొచ్చాయన్నారు. క్రికెట్‌కు సంబంధించి చెన్నై సూపర్ కింగ్స్ ముందుకొచ్చింది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు వాళ్లు కూడా ముందుకొచ్చారు. నియోజకవర్గ స్థాయి నుంచి ప్రొఫెసనల్ లెవల్‌లో వీళ్లంతా పార్టిసిపేట్ చేస్తారు. బ్యాడ్మింటన్‌కు సంబంధించి నాతోపాటు ఇక్కడే శ్రీకాంత్ ఉన్నాడు. సింధు కూడా ఇందులో భాగం కావడానికి ముందుకొచ్చింది.వీళ్లకు మన రాష్ట్రంలో ఒకరికి విశాఖలో ల్యాండ్, ఇంకొకరికి తిరుపతిలో ఇచ్చాం. బ్యాడ్మింటన్ అకాడమీస్ కూడా అక్కడ వీళ్లు స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తోంది. వీళ్లు కూడా మెంటార్లుగా మన ట్యాలెంట్‌ను గుర్తించడంలో, సానపట్టి వజ్రాలుగా మలచడంలో మన పిల్లలందరికీ తోడుగా ఉండేందుకు ముందుకు రావడం సంతోషకరం. వాలీబాల్‌కు సంబంధించి ప్రైమ్ వాలీబాల్, కబడ్డీకి సంబంధించి ప్రో కబడ్డీ ఆర్గనైజర్లు ముందుకు రావడం జరిగిందని సిఎం వివరించారు. ఈ కార్యక్రమం ఇక మీదట నుంచి ప్రతి సంవత్సరం కూడాజరుగుతుందని సిఎం జగన్ వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయి నుంచి ప్రొఫెషనల్ కిట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం కిట్లు ఇస్తూ మన పిల్లల్ని ప్రోత్సహించే కార్యక్రమం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయ స్థాయి నుంచి చూస్తే 34.19 లక్షల మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.15 వేల సచివాలయాల పరిధిలో, ఇప్పటికే 9 వేల ప్లే గ్రౌండ్లు గుర్తించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీ మైదానాలు, యూనివర్సిటీ గ్రౌండ్లు, మున్సిపల్ స్టేడియంలు, జిల్లా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను గుర్తించడం జరిగింది. రాబోయే సంవత్సరాల్లో అడుగులు ఇంకా వేగంగా పడతాయి. ప్రతి స్కూల్లోనూ ఎంకరేజ్ చేసేలా అడుగులు పడతాయి. స్కూళ్ల దాకా కిట్లు ఇచ్చే కార్యక్రమం తీసుకుంటూ పోతామని అన్నారు. క్రీడా సంబురాలు ఇకపై ప్రతీ ఏడాది జరుగుతాయి. రూ.12కోట్లకుపైగా నగదు బహుమతులు ఇవ్వనున్నారు. సీఎం జగన్ బ్యాడ్మింటిన్, ప్లేయర్ కిందాంబి శ్రీకాంత్ కలిసి క్రీడా జ్యోతిని వెలిగించారు. సీహెచ్ రమాదేవికి క్రీడల టార్చ్‌ను అందజేసిన సీఎం జగన్, ఆడుదాం ఆంధ్రలో స్పోర్ట్స్ కిట్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, రోజా, అంబటిరాంబాబు, మేరుగ నాగార్జున, విడదల రజినీతోపాటు జిల్లా అధికారులు ఇతర వైసీపీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేశంలో అతి పెద్ద మెగా ట్రోర్నీగా ఆడుదాం ఆంధ్రాను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ క్రీడలు 15 వేలకుపైగా గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ప్రారంభమయ్యాయి. 9,478 స్టేడియంలలో దాదాపు మూడు లక్షలపైగా జట్లు పోటీ పడనున్నాయి. మంగళవారం ప్రారంభమైన ఈ పోటీలు 47 రోజుల పాటు అంటే ఫిబ్రవరి 10 వరకు జరగనున్నాయి. ఈ పోటీలను వివిధ దశల్లో నిర్వహిస్తారు. తొలి దశలో జనవరి 9 వరకు గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో పోటీలు జరుగుతాయి. అక్కడ విజయం సాధించిన వాళ్లు తర్వాత దశ పోటీలకు ఎంపిక అవుతారు. వాళ్లు జనవరి పది నుంచి జరిగే మండలస్థాయిలో పోటీ పడతారు. ఆ పోటీలు జనవరి 23 వరకు జరుగుతాయి. అక్కడ విజేతలైన వారంతా నియోజకవర్గ స్థాయి క్రీడల్లో పాల్గొంటారు. ఈ పోటీలు జనవరి 24 నుంచి 30 వరకు సాగనున్నాయి. తర్వాత దశలో జిల్లా స్థాయిలో క్రీడాకారులు పోటీ పడాల్సి ఉంటుంది. ఈ జిల్లా స్థాయి పోటీలు జనవరి 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు ఉంటాయి. చివరిగా ÷నైల్ పోటీలు రాష్ట్రస్థాయిలో జరుగుతాయి. వివిధ జిల్లాల్లో విజయం సాధించిన వారంతా ఇక్కడ పోటీ పడతారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలు ఫిబ్రవరి ఆరు నుంచి 10 వరకు జరగనున్నాయి. రోజూ ఉదయం ఐదు గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 7 గంటల వరకు జరగనున్నాయి. ఈ పోటీలకు రిఫరీలుగా ఉండేందుకు లక్షా యాభై వేల మంది వలంటీరల్కు శిక్షణ ఇచ్చారు. 15 ఏళ్ల వయసు దాటిన వారంతా ఈ ఈవెంట్‌లో పాల్గొనే ఛాన్స్ ఇచ్చారు. అందుకే కోటీ 22 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో 34 లక్షల మంది క్రీడాకారులు పోటీ పడుతున్నారు. ఇందులో పది లక్షల మంది మహిళా క్రీడాకారులు ఉన్నారు. ఐదు క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. ఇందులో క్రికెట్‌కు ఎక్కువ మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఈవెంట్ కోసం ప్రభుత్వం 120 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఇందులో 12 కోట్ల రూపాయల నగదు బహుమతులు ప్రదానం చేయనున్నారు. 42 కోట్లతో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులకు కిట్‌లు పంపిణీ చేయనున్నారు. పాల్గొనే వారందరికీ టీ షర్టులు అందజేయనున్నారు.

# మారుమూల ప్రాంతాల అభివృద్ధి

## జిల్లా పర్యటనలో మంత్రి సీతక్క హామీ



మహబూబాబాద్,డిసెంబర్ 26 (సమ సమాజం): జిల్లాలోని మారుమూల ప్రాంతంలో ఉన్న వెనకబడిన మండలాలు కొత్తగూడ, గంగారం అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క)అన్నారు. మంగళవారం మంత్రి కొత్తగూడ మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ శశాంక, ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్, ఐ.టి.డి.ఎ. పీఓ అంకిత్ తో కలిసి లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రెండు మండలాల్లో తాగునీటి కొరత అధికంగా ఉన్నందన నిరంతరంగా నీళ్లు అందించే విధంగా అధికారులు దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్ర భవనాలకు మరమ్మతులు ఉంటే నిధులు మంజూరు చేస్తానని, అన్ని వసతులు కల్పించాలన్నారు. రాష్ట్రంలోని 14 వేల పోస్టులు ఖాళీలు ఉన్నట్లు తమ దృష్టిలో ఉందని త్వరలోనే భర్తీ చేస్తామని తెలియజేశారు. నిధులు మంజూరైన చోట త్వరితగతిన పనులు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు బ్యాంక్ అదనపు బ్రాంచికి కోరినందున త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాపాలనను అంకిత భావంతో చేపట్టి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ ఎర్రయ్య, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ హేమలత, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమాంధ్రప్రదేశ్‌గా ఆంధ్రా

## హామీలు నెరవేర్చడంలో జగన్ విఫలం

**తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్**

అమరావతి,డిసెంబర్ 26 (సమ సమాజం): ఆంధ్రప్రదేశ్ ఉద్యమాంధ్రప్రదేశ్‌గా మారిందని ఇందుకు సమ్మెలే నిదర్శనమని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. అంగన్‌వాడీలు, మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో విఫలం అయ్యారని అన్నారు. పాదయాత్రలో నోటికొచ్చిన హామీలు ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అందరినీ మోసం చేశారని లోకేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లు, త్వరలో వాలంటీర్లు.. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రో÷-లడెక్కి నిరసన తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ రోజు నుంచి ప్రారంభమవుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మెకు కూడా టీడీపీ పూర్తి స్థాయి మద్దతు ఇస్తోందన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు ఎలా అయితే రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు మద్దతు తెలిపాయో.. అలానే సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న మున్సిపల్, ఆశా వర్కర్లకు కూడా మద్దతు తెలపాలని పిలుపు ఇస్తున్నామని నారా లోకేష్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు ప్రజలు విసుగెత్తి ఉన్నారని , వైసీపీ ప్రజాప్రతినిధులపై తీవ్ర వ్యతిరేకత ఉందని, వైసీపీ నియంత పాలనకు ప్రజలే త్వరలో ఓట్ల రూపంలో బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. ప్రతిఒక్కరూ తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు.

# ఆడబిడ్డలు రోడ్డెక్కినా కానరావడం లేదు

## సిఎం జగన్ తీరుపై సిపిఎం నేత ఆగ్రహం



నెల్లూరు,డిసెంబర్ 26 (సమ సమాజం): ఏపీలో అస్సలు ప్రభుత్వం ఉందా? అంటూ సీఎం జగన్‌పై సీపీఎం నేత శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో అస్సలు ప్రభుత్వం ఉందా? అనే అనుమానం వస్తుంది. సీఎం జగన్? నా అక్కచె÷-లలెమ్మలు అంటుంటారు. 15 రోజులుగా అంగన్ వాడీ ఆడబిడ్డలు రోడ్డు ఎక్కితే పట్టించుకోరు. ఏపీలో 30 లక్షల మంది తల్లులు, పిల్లలకి పౌష్టికాహారం అందడం లేదు. మా నమ్మకం నువ్వే అంటారు. ఇదేనా నమ్మకం. అన్ని విభాగాల కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులు సమ్మెలకు దిగుతున్నా పట్టించుకోరు. ప్రభుత్వం వద్ద డబ్బులు ఉన్నాయి. లేకుంటే రూ.20 వేల కోట్లుతో స్మార్ట్ మీటర్లు ఎలా పెడుతున్నారు. అది కూడా అదానీకి అప్పగించారు. కరెంటు బిల్లులకంటే అదనపు ఛార్జీలు వసూలు చేస్తూ జనం మాడు పగులగొడుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మేడిగడ్డ కుంగడం తెలంగాణకు తలవంపులు

## ఖమ్మం పర్యటనలో మంత్రి కోమటిరెడ్డి



ఖమ్మం,డిసెంబర్ 26 (సమ సమాజం): బీఆర్ఎస్ పాలనలో విధ్వంసానికి గురైన తెలంగాణలో పాలనను గాడిలో పెడుతున్నామని, ప్రాజెక్టుల పేరుతో కోట్ల రూపాయలు దోచుకున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి విమర్శించారు. మంగళవారం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ఇన్ ఛార్జి మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం డిజైన్ చేశానని చెప్పుకున్న కేసీఆర్ ఒక్క ఎకరాకు నీరు ఇవ్వలేదని, కనీసం కాలువలు తవ్వలేదని విమర్శించారు. మేడిగడ్డ కుంగిపోవటం తెలంగాణకే తలవంపులని అన్నారు. మేడిగడ్డ కుంగటం విధ్వంస చర్య అని కల్లబొల్లి మాటలు చెప్పారన్నారు. ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రాన్నిఅన్ని రంగాలలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. పేదవాడి ఆత్మగౌరవం నిలబెడతామని, నిజాయితో కూడిన పాలన ప్రజలకు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి స్పష్టం చేశారు. అవినీతిని సహించేది లేదన్నారు. విచారణలో అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు. అవినీతికి పాల్పడ్డ ఎవరినీ వదలబోమని మంత్రి స్పష్టం చేశారు.

# తప్పుడు లెక్కలతో మభ్యపెట్టలేరు: వేముల



నిజామాబాద్,డిసెంబర్ 26 (సమ సమాజం): తెలంగాణలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిది, నాటి సిఎం కెసిఆర్‌దని ఈ విషయం దేశం మొత్తానికి తెలుసని, తెలియంది కేవలం కాంగ్రెస్ నేతలకు మాత్రమేనని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. భారతదేశ చరిత్రలో రైతులకి నేరుగా డబ్బులు అందించే రైతుబంధు కార్యక్రమంతో మొదలుకొని రైతు బీమా, 24 గంటల వ్యవసాయ ఉచిత విద్యుత్ సరఫరా వంటి అనేక చారిత్రాత్మక పథకాలు తెలంగాణలో అమలు చేసిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. తప్పుడు లెక్కలతో గత ప్రభుత్వం నిధులు దుర్వినియోగం చేసిందన్న విమ్మల్లో నిజం లేదన్నారు. ÷ూష్ట్ర వ్యవసాయ ప్రగతిపైన ఉన్న గుడ్డి వ్యతిరేకతతో కాంగ్రెస్ కక్షకట్టిందని వేముల విమర్శిం చారు. అయితే విమ్మలు చేసే వారికి విచారణలో నిజాలు తెలుస్తాయని, ప్రజలకు కూడా తెలుస్తుందని అన్నారు.నిధులు మళ్లింపు అంటూ కెసిఆర్ సర్కారుపై అధికార కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తున్నదని ఆరోపించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని ఒత్తిడి చేసినా కెసిఆర్ ప్రభుత్వం అనారు. కాంగ్రెస్ శ్వేతపత్రాల్లో లెక్కలు తప్పని ఇప్పటికే కెటిఆర్ నిరూపించారని అన్నారు. తప్పుడు లెక్కలతో ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు.

# హిందూక్షేత్రాలపై రాజకీయం తగదు: బండి




కరీంనగర్,డిసెంబర్ 26 (సమ సమాజం): కేరళకు అయ్యప్ప భక్తులు వెళ్లకుండా కుట్రలు చేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. మంగళవార నాడు బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...అయ్యప్ప భక్తుల ఇబ్బందులు పాలకులకు కనిపించడం లేదా..?హిందూ క్షేత్రాలను ఎందుకు వివాదం చేస్తున్నారని ప్రశ్నించారు. సనాతన ధర్మాన్ని నాశనం చేసే కుట్రలు జరుగుతున్నాయి. తబ్లీగీ జమాత్‌ను ఇస్లామిక్ దేశాలు నిషేధించాయి. ఆ సంస్థని రాష్ట్రానికి ఎలా అనుమతి ఇస్తారు. కొవిడ్‌ను రాష్ట్రానికి తెచ్చిందే తబ్లీగీ జమాత్ సంస్థనే. తిరుపతిలో పులులు వస్తే భక్తులకు కర్రలు ఇస్తారా...? తిరుమలకు భక్తులు రాకుండా కుట్రలు చేస్తున్నారు' అని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# దేశంలో విజృంభిస్తున్న కొత్త వైరస్

## దేశవ్యాప్తంగా 412 పాజిటివ్ కేసులు నమోదు

### తాజాగా ముగ్గురు మృతి



న్యూఢిల్లీ,డిసెంబర్ 26 (సమ సమాజం): దేశంలో కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తోంది. రోజు రోజుకు పెరుగుతున్న కేసులు కలవరపెడుతున్నాయి. గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 412 పాజిటివ్ కేసులు నమోదు కాగా.. ముగ్గురు మృతి చెందడం కలకలం రేపుతోంది. ఇప్పటి వరకు భారత్‌లో 4170 యాక్టీవ్ కేసులు నమోదయ్యాయి. కర్ణాటకలో ముగ్గురు మృతి చెందారు. ప్రస్తుతం తెలంగాణలో 55, ఏపీలో 29 యక్టీవ్ కేసులు ఉన్నట్లు సమాచారం. కరోనా కొత్త సబ్-వేరియంట్ 'జేఎన్.1' వేగంగా విస్తరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, కేరళలో కేసులు పెరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో కేంద్రం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఆర్టీపీసీఆర్ పరీక్షలను పెంచాలని ఆదేశించింది. మంగళవారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి అధ్యక్షతన మహమ్మారి కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశ నిర్దేశం చేయనున్నారు. కాగా దేశంలో రోజు రోజుకు కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నైట్ కర్ఫ్యూ తప్పదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు న్యూ ఇయర్ వేడుకలపై కరోనా ఆంక్షల ప్రభావం పడనుందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కరోనా ప్రభావిత ప్రాంతాల్లో వైరస్ ఉధృతి తగ్గకపోతే ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఆంక్షలు అమలు చేసే అవకాశముంది.దేశంలో ఇప్పటి వరకు కరోనా కొత్త సబ్-వేరియంట్ 'జేఎన్.1' కేసులు 64 నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం వెల్లడించింది. వీటిలో అత్యధికంగా గోవాలో 34 కేసులు వెలుగుచూశాయి. మహారాష్ట్రలో 9, కర్ణాటక 8, కేరళ 6, తమిళనాడు 4, తెలంగాణలో 2 కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా సోమవారం మరో 628 కరోనా కేసులు వెలుగుచూడగా మొత్తం క్రియాశీల కేసుల సంఖ్య 4,504కు చేరింది. కాగా, జేఎన్.1 వేరియంట్ సోకినవారిలో స్వల్ప లక్షణాలు మాత్రమే కనిపిస్తున్నాయని వైద్యులు వివరిస్తున్నారు. కేరళలో కొన్ని రోజుల క్రితం జేఎన్.1 తొలి కేసు బయటపడింది. 79 ఏళ్ల మహిళకు సోకిందని, ఆమె ఇంట్లోనే ఉండి పూర్తిగా కోలుకున్నారని పేర్కొన్నారు.

# దూకుడు పెంచిన జనసేనాని

## నేడు కాకినాడకు రానున్న పవన్ కళ్యాణ్ ◆ మూడ్రోజులపాటు ఇక్కడే మకాం



కాకినాడ,డిసెంబర్ 26 (సమ సమాజం): జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ దూకుడు పెంచారు. మూడు రోజుల పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాపై దృష్టి సారించబోతున్నారు. కాకినాడలో ఆయన బస చేయబోతున్నారు. 27న కాకినాడ చేరుకోనున్న పవన్ 28,29, 30 తేదీల్లో నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేయనున్నారు. గతంలో వారాహియాత్రను దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో పవన్ పూర్తి చేశారు. అదే సమయంలో.. ఉమ్మడి జిల్లాలో జనసేనకు పొత్తుల్లో భాగంగా ఎక్కువ స్థానాలు కేటాయించే అవకాశం ఉంది. ఇప్పటికే వాటిపై ఓ స్పష్టత వచ్చిందని జనసేన వర్గాలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో పార్టీ నేతలందర్నీ సమన్వయం చేసుకుని.. కూటమి విజయానికి ఏం చేయాలన్నదానిపై వ్యూహ రచన చేసే అవకాశం ఉంది. గత అనుభవాలు, బలాలను దృష్టిలో పెట్టుకుంటే ఉభయగోదావరి జిల్లాల్లో టీడీపీ, జనసేన ఎలాంటి అరమరికలు లేకుండా కలిసి పోటీ చేస్తే క్లీన్ స్వీప్ చేయవచ్చన్న అంచనాలు జనసేన, టీడీపీ వర్గాల్లో ఉన్నాయి. అందుకే జనసేన పార్టీ చేసే స్థానాల్లో బలమైన అభ్యర్థులను ఖరారు చేయడంతో పాటు? టీడీపీ పోటీ చేసే చోట్ల నేతలంతా సమన్వయంతో? పని చేసుకుని మంచి ఫలితాలు సాధించేలా అందరికీ దిశానిర్దేశర చేయాలని పవన్ అనుకుంటున్నారు. తెలుగుదేశం, జనసేన ఇప్పటికే అంతర్గత చర్చలు.. సర్వేల ద్వారా.. ఏయే స్థానాల్లో ఎవరెవరు పోటీ చేస్తే బాగుంటుందో ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చారని ఆయా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జనసేన పోటీ చేసే స్థానాల విషయంలో ఎక్కువ చాన్స్ లు ఉన్న చోట్ల పరిస్థితిపై అధ్యయనం చేయడం, నేతలకు కర్తవ్య బోధచేయడం.. చేరికలను ప్రోత్సహించడానికి పవన్ కాకినాడలో మూడు రోజుల పాటు మకాం వేస్తున్నట్లుగా ఉంది. జనసేనానికి రాజకీయం ఇప్పుడు పూర్తిగా వేరని.. ఆ పద్దతిలోనే రాజకీయం చేస్తారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. పవన్ పర్యటనలకు వచ్చే వారు ఒక్క శాతం అయితే.. బయటకు రాని వారు.. 90 శాతం ఉంటారని వారందరి చేతా ఓట్లు వేయించుకోవాలంటే.. సమైక్యంగా ఉండాలని అనుకుకుంటున్నారు. గోదావరి జిల్లాల్లో జనసేన ప్రభావాన్ని తగ్గించడానికి వైసీపీ అధినేత జగన్ చాలా ఎ÷-లాన్లు వేస్తున్నారు. ముద్రగడ పద్మనాభం వంటి వారిని తెరపైకి తెస్తున్నారు. ఈ రాజకీయాలన్నింటినీ పవన్ ఎదురకోవాల్సి ఉంది. అందుకే పవన్ కల్యాణ్.. టీడీపీ, జనసేన పొత్తు వంద శాతం సఫలీకృతమయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మూడు రోజుల పర్యటనలో ఉత్తరాంధ్ర నుంచి పలువురు నేతలు జనసేనలో చేరేందుకు కాకినాడ వచ్చే అవకాశం ఉంది.

# తెలంగాణలో ఎంపి ఎన్నికలపై బిజెపి నజర్

## 28న హైదరాబాద్‌కు వస్తున్న అమిత్ షా

## కొంగర కలాన్‌లో నేతలతో సమీక్ష

హైదరాబాద్,డిసెంబర్ 26 (సమ సమాజం): లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణ బీజేపీ కసరత్తు మొదలు పెట్టింది. టీబీజేపీ నేతలకు దిశానిర్దేశర చేసేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ నెల 28న తెలంగాణకు వస్తున్నారు. తెలంగాణలో మెజారిటీ స్థానాల్లో గెలుస్తామని, ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి కొలువుతీరుతుందని కమలనాథుల ంటున్నారు. సార్వత్రిక ఎన్నికలకు గడువు సమీపి స్తున్న వేళ తెలంగాణపై భారతీయ జనతా పార్టీ ఫోకస్ చేసింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది సీట్లు గెలవడంతో పాటు ఓట్ షేర్ కూడా గణనీయంగా పెరగడంతో పార్టీ వర్గాల్లో జోష్ నెలకొంది. ఇదే దూకుడును పార్లమెంట్ ఎన్నికల్లోనూ కొనసాగించాలని యోచిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో 4 సీట్లు గెలుచుకున్న బీజేపీ ఈసారి పదికి పైగా స్థానాలపై గురిపెట్టింది. ఇందులో భాగంగా ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. అభ్యర్థుల ఎంపికతో పాటు క్యాడర్‌కు మార్గ నిర్దేశం చేసేందుకు స్వయంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా రంగంలోకి దిగుతున్నారు. ఈ నెల 28న అమిత్ షా హైదరాబాద్ వస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కొంగర్‌కలాన్‌లో పార్టీ మండల స్థాయి అధ్యక్షులు, ఆపై స్థాయి నేతలతో సమావేశమ వుతారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై రాష్ట్ర నాయకత్వంతో చర్చిస్తారు. జనవరి 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం, రాములోరి విగ్రహ ప్రాణప్రతిష్ఠ తర్వాత తెలంగాణలో బీజేపీకి మరింత సానుకూలత ఏర్పడుతోందని కమలనాథులు అంచనావేస్తున్నా రు.

# ఇందల్‌వాయి టోల్‌ప్లాజా వద్ద లారీ బీభత్సం

## కారును ఢీకొనడంతో ముగ్గుఇకి గాయాలు

నిజామాబాద్,డిసెంబర్ 26 (సమ సమాజం): నిజామాబాద్ జిల్లాలో ఓ లారీ బీభత్సం సృష్టించింది. మంగళవారం ఇందల్వాయి టోల్ ప్లాజా దగ్గర వేగంగా వచ్చి ఓ లారీ, ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. దీంతో కారు..టోల్ ప్లాజా కౌంటర్ లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.లారీ డ్రైవర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ మద్యం మత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిలో ఇద్దరు టోల్ ప్లాజా సిబ్బంది, కారులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి ఉన్నారని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

# పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఎవరికీ న్యాయం జరగలేదు

## రెండు హామీలు అమలు చేసి ప్రజల్లో నమ్మకం కలిగించాం

## బియ్యం రీ సైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు

## నల్లగొండలో ప్రజాపాలనపై మంత్రుల సమీక్ష




నల్గొండ,డిసెంబర్ 26 (సమ సమాజం): పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం నాడు నల్గొండలో ప్రజాపాలన సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి నల్గొండ జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ వర్గానికి న్యాయం జరగలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు హామీలు అమలు చేశామని చెప్పారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తెలిపారు. 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజా పాలన పారదర్శకంగా చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో మొదటిసారి గెలిచినా ఎమ్మెల్యేలు కూడా రాజులా ఫీల్ అయ్యారని ఎద్దేవా చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని గర్భాలు పలికారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సెటైర్లు వేశారు. గతంలోనూ ఉమ్మడి నల్గొండ జిల్లా నేతలతో తనకు మంచి రాజకీయ సంబంధం ఉందని జిల్లా ఇంఛార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తన హయాంలో మొదలైన ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణాలు మళ్లీ మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి హయాంలో పూర్తి కాబోతున్నాయని చెప్పారు. ఈ ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో ముందుకు తీసుకుపోతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని, ప్రాజెక్టుల వద్దే కుర్చీ వేసుకుని.. నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్న వారిలా తాము ఉండమన్నారు. పీడీఎస్ రైస్ రీసైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలోనూ తన హయాంలో మొదలైన ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణాలు మళ్లీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి హయాంలో పూర్తి కాబోతున్నాయని చెప్పారు. ఈ ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకుపోతామన్నారు.

# తెలంగాణను ఆదుకోవాలని కోరాం

## నిధులు విడుదల చేసి సాయం అందించాలని వినతి

బిఆర్ఎస్ ఆర్థిక విధ్వంసం నుంచి కాపాడాలి

పెండింగ్ నిధులు విడుదల చేస్తేనే మనుగడ సాధ్యం

పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా

స్టీల్ ప్లాంట్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయండి

ప్రధాని మోడీని కలిసి విన్నవించినట్లు వివరించిన డిప్యూటి సిఎం భట్టి

సిఎం రేవంత్‌తో కలసి తెలంగాణ భవన్‌లో మీడియాకు వెల్లడి



న్యూఢిల్లీ,డిసెంబర్ 26 (సమ సమాజం): తెలంగాణకు రావాల్సిన ప్రయోజనాలు, మంజూరు కావాల్సిన నిధుల గురించి ప్రధాని మోదీకి వివరించినట్లుగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను గత ప్రభుత్వం తీసుకురాలేకపోయిందని భట్టి చెప్పారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం ప్రధాని మోదీని కలిశారు. అరగంట సేపు వీరి భేటీ సాగింది. ఈ భేటీ తర్వాత సాయంత్రం ఢిల్లీలో రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధానితో జరిగిన సమావేశ వివరాలను భట్టి విక్రమార్క మీడియాకు వివరించారు. అలాగే హైదరాబాద్ కు ఐటీఐఆర్, వెనుబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, స్టీల్ ప్లాంట్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సైనిక్ స్కూల్ వంటివాటిని మంజూరు చేయాలని ప్రధానిని కోరినట్లుగా భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన వివరాలను ప్రధానికి వివరించినట్లు చెప్పారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడడం కోసం తొలిసారి ప్రధాని మోదీని కలిశామని, తమ వినతులపై ప్రధాని సానుకూలంగా స్పందించారని భట్టి విక్రమార్క వివరించారు. బీఆర్ఎస్ చేసిన అప్పుల నుంచి బయట పడడం కోసం పెండింగ్‌లో ఉన్న నిధులను ఇవ్వాలని కోరినట్లు వెల్లడించారు. నీళ్లు- నిధులు - నియామకాల విషయంలో గత రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేసిందని అన్నారు. పదేళ్లు పాలన చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థల్ని నాశనం చేసిందని ఆరోపించారు. ఆ లోటు నుంచి భర్తీ అవడం కోసం వెంటనే కేంద్రం నుంచి గ్రాంట్లను విడుదల చేయాలని ప్రధానిని కోరినట్లు భట్టి చెప్పారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధానిని కలిశామని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం.. కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై చర్చించామని తెలిపారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలని కోరామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. విభజన చట్టం ప్రకారం ఒక మేజర్ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వాలని ప్రధానిని అడిగామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుకు మంజూరు చేయాలని కోరామన్నారు. తెలంగాణకు ఐఐఎం సైనిక్ స్కూల్ మంజూరు చేయాలని అడిగామని చెప్పారు. బిఆర్ఎస్ నేతల ఆర్థిక అరాచకత్వంతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం అయిందన్నారు. అప్పుల్లో కూరుకున్న తెలంగాణకు.. ఆర్థిక సాయం చేయాలని ప్రధానిమంత్రి నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేవామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# బైజూస్ ఒప్పందంపై సర్వత్రా విమర్శలు

## ట్యాబ్‌ల కొనుగోళ్లపైనా అనుమానాలు ◆ కంపెనీకి లబ్ది చేకూర్చే పథకమంటూ ఆరోపణలు

అమరావతి,డిసెంబర్ 26 (సమ సమాజం): విద్యార్థులకు ఉచిత విద్య, ఇంగ్లీష్ మీడియం చదువులని చెబుతున్న ప్రభుత్వం ఇటీవలే ట్యాబ్‌లను కూడా పంపిణీచేసింది. ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విప్లవం తెస్తామని, వాటి ఫలితాలను రాష్ట్రంలోని పేద కుటుంబాలు వచ్చే పదేళ్లలో అనుభవిస్తాయని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెబుతున్నారు. అయితే దీనిపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. బైజూస్ అనే కంపెనీకి ప్రభుత్వం దోచి పెడుతోందని అంటున్నారు. సిపిఎం నేత మధు దీనిపై ఘాటుగానే స్పందించారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు, బోధిస్తున్న టీచర్లకు మొత్తంగా 5,18,740 ట్యాబుల పంపిణీకిఇటీవలే సిఎం జగన్ శ్రీకారం చుట్టారు. బైజూస్ ప్రీ లోడెడ్ కంటెంట్‌తో అందించనున్న ఈ ట్యాబుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,466 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. పిల్లలకు మరింత సులువుగా పాఠాలు అర్థమయ్యేందుకు వీలుగా ట్యాబులు అందిస్తున్నామని చెప్పారు. అసలు బైజూస్ కంటెంట్ వల్ల అటువంటి బహుళ ప్రయోజనం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం కానీ, లేక సిబిఎస్ఇ లేదా ఇంకేదైనా శాస్త్రీయ అధ్యయనం చేసే సంస్థగానీ నిర్ధారించిన దాఖలాల్లేవు. కంటెంట్ విషయంలో ఎవరితోనైనా సంప్రదించివుంటే ఆ విషయాన్నైనా బయటపెట్టాలి కానీ సర్కారు అదీ చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వమే ఏకపక్షంగా బైజూస్ కంపెనీని ఎంపిక చేసుకొని, వందల కోట్ల రూపాయలు దానికి కుమ్మరించిందని సిపిఎం నేత మధు విమర్శించారు. ఈ నేపథ్యంలోనే దివాళా తీసిన సంస్థకు సిఎం మార్కెటింగ్ మేనేజర్‌లాగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ విద్యపై బైజూస్ పెత్తనాన్ని అంగీకరించడం ప్రమాదకరం అని కూడా అంటున్నారు. ట్యాబుల కొనుగోలు సందర్భం గా నిర్ణయించిన ప్రమాణాల విషయంలోనూ వస్తున్న ఆరోపణలతో కొన్ని సందేహాలు తలెత్తుతున్నాయి. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, కొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలూ కొనుగోలు చేసే ట్యాబులకు ఎనిమిది అంగుళా ల సైజుకు పైబడాలన్న నిబంధన అమలు చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాన్ని 8.7 అంగుళాలుగా నిర్ణయించడం మూలంగా ఒక్క కంపెనీకి మాత్రమే అర్హత కలిగించిందన్న అంశం కూడా విమర్శలు వస్తున్నాయి. టెండర్ విషయంలో లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ లేదని ఇతర కంపెనీలు లబోదిబోమంటున్నాయి. బైజూస్ కంపెనీ అనైతిక వ్యవహారాలు ప్రస్తుతం ఎన్‌సిపిసిఆర్ విచారణ పరిధికి వెళ్లాయి. ట్యాబుల్లో ప్రీలోడ్ చేసిన కంటెంట్ నాణ్యత ఎక్కడా నిగ్గు తేలలేదు. వాటితోబాటు ట్యాబుల కొనుగోలు విషయంలోనూ అనుమానాలు రేకెత్తాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పథకం అమలును నిలుపు చేయాలన్న డిమాండ్లు వస్తున్నాయి. ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విప్లవం తెస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబుల్లో లోడ్ చేసిన స్టడీ మెటీరియల్ నాణ్యత, వాటి కొనుగోలు వ్యవహారం, బైజూస్ కంపెనీ అనుసరించిన తప్పుడు పద్ధతులపై వస్తున్న మీడియా కథనాలు పలు సందేహాలకు తావిస్తున్నాయి. పిల్లలు, వారి తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను అక్రమంగా కొనుగోలు చేసి, తల్లిదండ్రులను బైజూస్ బెదిరిస్తోందని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒత్తిడి చేసి కోర్సులను కొనుగోలు చేయించడం, నిబంధనలకు విరుద్ధంగా ఫోన్ నెంబర్లను సంపాదించడం లాంటి అతిక్రమణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. బైజూస్ సంస్థ రుణ ప్రాతిపదికన సైతం తల్లిదండ్రులతో ఒప్పందాలు చేసుకుంటోందని, ఎవరైనా తిరిగి తమ మొత్తాన్ని ఇవ్వాలని, ఈ ఒప్పందం నుంచి వెనక్కు వెళ్లిపోతామని కోరినా అంగీకరించకుండా వేధింపులకు గురిచేస్తోందని తెలిపారు. తాము దోపిడీకి గురయ్యామని, మోసపోయామని పలువురు తల్లిదండ్రులు కమిషన్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారని పేర్కొన్నారు.

# చిన్నారి కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు

## మహిళా కిడ్నాప్ అరెస్ట్

హైదరాబాద్,డిసెంబర్ 26 (సమ సమాజం): పాతబస్తీలో 18 నెలల చిన్నారి కిడ్నాప్ కేసు సుఖాంతమైంది. బహుదూర్‌పురా పీఎస్ పరిధిలోని కిషన్‌బాగ్‌లో సోమవారం ఏడాదిన్నర వయసున్న చిన్నారి కిడ్నాప్‌కు గురైంది. పాపను ఓ మహిళ అపహరించి తీసుకెళ్లుతున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డయ్యాయి. సీసీటీవీ ఆధారంగా 24 గంటల వ్యవధిలోనే పసికందు ఆచూకీని బహదూర్‌పురా పోలీసులు కనుగొన్నారు. ఫిర్యాదు ఇచ్చిన నాలుగు గంటల్లోనే కిడ్నాప్ కేసును ఛేధించారు. కిడ్నాప్ చేసిన మహిళను అరెస్ట్ చేశారు. చిన్నారిని తల్లిదండ్రులకు పోలీసుల అప్పగించారు. తన కొడుకుకి 8 ఏళ్లుగా పిల్లలు పుట్టకపోవడంతో మహిళ.. పాపను కిడ్నాప్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ప్రధాని మోడీని కలిసిన సిఎం రేవంత్, డిప్యూటి సిఎం భట్టి

(మొదటి పేజి తరువాయి) తెలంగాణ పోలీసులు నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద భారీగా మొహించారు. ఏపీ పరిధిలో ఉన్న గేట్లకు కంచె ఏర్పాటు చేశారు. తమ నీళ్లను తాము నియోగించుకుంటు న్నామని చెప్పారు అక్కడి ఇరిగేషన్ అధికారులు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి స్పందిస్తూ రాబోయేది తమ ప్రభుత్వం అని నీటి పంప కాలపై ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారుల తో కూర్చొని చర్చించుకుంటామన్నారు.



## పార్లమెంట్ ఎన్నికల వరకు కాంగ్రెస్‌కు అనుకూలమే




(మొదటి పేజి తరువాయి) నేతలు ఎవరు కూడా ఇప్పుడు లేరు. అలాగే అనేకులు ఎన్నికల ముందు పార్టీని వదిలి వెళ్లారు. అంతే కాదు కొందరు సీనియర్ నేతలను వదులుకున్నారు. జూపల్లి కృష్ణారావు, పొంగులేటి, తుమ్మల సహా అనేక మందిని వదులుకున్నారు. వారి వల్ల పది సీట్ల వరకూ కోల్పోయారు. అధికారానికి కూడా దూరం అయ్యారు. ఆ నేతల బలాన్ని ఎందుకు కేసీఆర్ గుర్తించలేకపోయారన్నది అర్థం కాని విషయం. కాంగ్రెస్ తరపున గెలిచి వచ్చిన వారందరికీ టిక్కెట్లు ఇచ్చారు. సబితా ఇంద్రా రెడ్డి, సుధీర్ రెడ్డి లాంటి వారు తప్ప అందరూ ఓడిపోయారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అని ప్రజల్లో నిగూఢంగా ఉన్న కోరికను వెలికి తీయడానికి ఆయనకు చాలా సమయం పట్టింది. ఎలాంటి సెంటిమెంట్ లేకుండా ప్రజల్ని తన వైపు చూసేలా చేసుకోవడం అంత తేలిక కాదు. అందినీ వదులకోవడం, కొందరని దూరం పెట్టడం వల్ల ఉత్పన్నమైన ప్రమాదాన్ని కేసీఆర్ ఇప్పుడు ఎదుర్కొంటున్నారు. ఆయన ప్రాధాన్యం మసకబారిపోతుంది. మొత్తంగా కేసీఆర్ చాణక్యం పతనానికి కారణం అయింది. కేసీఆర్ తనపై అతి విశ్వాసంతో ప్రజలు తాను ఏం చేసినా అంగీకరిస్తారన్న భావనతో వేసిన అడుగులే ఆయనను విజేత స్థానం పరాజితగా నిలిపింది. కేసీఆర్ జాతీయ రాజకీయాల ఆశలన్నీ కుప్పకూలిపోయాయి. ఇప్పుడు సొంత రాష్ట్రంలో పార్లమెంట్ సీట్ల కోసం కిందా మీదా పడాల్సిన వస్తోంది. అధికాంలో కాంగ్రెస్ ఉండడం వల్ల పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు అంత సునాయాసం కాదు. ఎందుకంటే అసెంబ్లీ ఎన్నికల ఫలితా ఊపు మరో ఆరు నెలల వరకు ఉంటుంది. ఇకపోతే బీజేపీ తన విజయాన్ని తానే చేజేతుగా పోగొట్టుకుంది. ఇప్పుడు ఎంపి ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోంది. అయితే మారిన పరిస్థితుల్లో రెండు పార్టీలకుఎంపి సీట్లు గెలవడం అంత సులువు కాదు. బండి సంజయ్‌ను తెలంగాణ బీజేపీ చీఫ్‌గా తొలగించక ముందు బీజేపీ దూకుడు మీద ఉండేది. కానీ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి త్రిముఖ పోరులో అధికారం కోసం పోటీ పడాల్సిన కీలక సమయంలో కాడి వదిలేసినట్లు అయ్యింది.కాంగ్రెస్ అవకాశాన్ని అంది పుచ్చుకుంది. ఇప్పుడు హామీలను చకచకా అమలు చేస్తోంది. ప్రజల్లోకి చొచ్చుకుని వెళు తుంది. మొత్తంగా 2023 తెలంగాణ రాజకీయాల్లో రేవంత్ రెడ్డి విజేతగా దూసుకుని వచ్చారు. మళ్లీ కొత్త ఏడాది వచ్చేస్తోంది. కొత్త పోటీలు తీసుకు వస్తుంది. మార్చి, ఏప్రిల్‌లోనే లోక్ సభ ఎన్నికలు ఉన్నాయి. అందులో విజేతలుగా నిలిస్తే.. ఇప్పటి ఫలితాలకు ప్రయోజనం ఉంటుంది. అయితే అప్పటి వకు కాంగ్రెస్ విజయయాత్రను కొనసాగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

## పారిశ్రామికాభివృద్ధిని కొనసాగిస్తాం



(మొదటి పేజి తరువాయి) రేవంత్ రెడ్డిని ఫాక్స్‌కాన్ ప్రతినిధులు మంగళవారం కలిశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎస్ శాంతి కుమారి ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఫాక్స్‌కాన్ కు చెందిన హాన్ హాయ్ ప్రెసిషన్ ఇండస్ట్రీస్ ప్రతినిధి వీలీ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో పలు అంశాలపై చర్చించారు. కొంగర కలాన్ ఉత్పాదక కేంద్రం నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని సీఎం హామీనిచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలను కాపాడే భాద్యత కొత్తగా ఏర్పడిన తమ ప్రభుత్వంపై ఉందన్నారు. అన్ని వర్గాలకు స్నేహపూర్వకంగా ఉండే విధానాన్ని అవలంబిస్తున్నామని.. పారిశ్రామిక వేత్తలకు కూడా పూర్తి సహాయ, సహకారాలందిస్తామని అన్నారు. పరిశ్రమల అభివృద్ధి, ఏర్పాటుకు కావాల్సిన అనుమతులు సులభంగా అందించడం తోపాటు, మౌలిక సదుపాయాలను కల్పిస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా దేశంలోనే అగ్రగామిగా ఉంచేందుకు కావాల్సిన అన్ని చర్యలను తీసుకుంటామని తెలియజేసారు. కాగా.. లక్ష ఉద్యోగాలను కల్పిస్తామనే హామీతో ఫాక్స్‌కాన్ గ్రూప్ మార్చి 2023లో తెలంగాణ ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం చేసుకుంది. మొదటి దశలో అంటే వచ్చే రెండేళ్లలో 25 వేల ఉద్యోగాలను ఫాక్స్‌కాన్ సంస్థ కల్పించనుంది. ఫాక్స్ కాన్ సంస్థ ఆపిల్ ఐఫోన్లను ప్రధానంగా తయారుచేస్తుంది. చైనా, వియత్నాం, థాయ్లాండ్, మలేషియా, అమెరికా, యూరప్, భారత్ సహా 24 దేశాలలో ఫాక్సాకాన్ సంస్థ కార్యకలాపాలు సాగిస్తున్నది. మన దేశంలో ఏపీ (శ్రీ సిటి), తమిళనాడు (శ్రీ పెరంబుదూర్), తెలంగాణ (కొంగర కలాన్), కర్ణాటక (బెంగళూరు సమీపంలో) సంస్థ పనిచేస్తున్నది. ఫాక్స్ కాన్ సంస్థ ఎలక్ట్రానిక్స్ పరికరాలు, ఉపకరణాలు తయారుచేసే వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించనుంది.

## వారిద్దరూ చెమట కక్కి సంపాదించారా

(మొదటి పేజి తరువాయి) సంపాదించి నట్లు చెబుతున్నారు. తెలంగాణ ప్రజల చెమటతో వచ్చిన ఆదాయం అది. వాళ్లు చేసిన అప్పుల్ని తీర్చాలంటే తెలంగాణ ప్రజలు స్వేదం చిందించాలని భట్టి వ్యాఖ్యాంచారు. ఎన్నికల ప్రచార సమయంలో రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ నేతలు తిన్నవన్నీ కక్కిస్తామని అన్నారు. అది జరిగి తీరుతుంది. జ్యుడీషియల్ ఎంక్వైరీ కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందని అన్నారాయన. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు భట్టి ఢిల్లీ పర్యటనలో పాల్గొంటారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలపై పలువురు కేంద్ర మంత్రులతో చర్చించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే.. ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అనంతరం.. కాంగ్రెస్ అగ్రనేతల్ని ఈ ఇద్దరూ కలవనున్నట్లు సమాచారం.

## వెహికల్ చలాన్లపై రాయితీ



(మొదటి పేజి తరువాయి) హైదరాబాద్, డిసెంబర్ 26 (సమ సమాజం): వాహనదారులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పెండింగ్ చలాన్లపై రాయితీ ఇస్తామని ఇటీవల ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి.. అనుకున్నట్లుగానే పెండింగ్ చలాన్ల రాయితీపై జీవో విడుదల చేశారు. మంగళవారం నుంచే పెండింగ్ చలాన్లపై రాయితీ వర్తిస్తుందని జీవోలో తెలిపారు. ఇటీవల కాలంలో పెండింగ్ చలాన్లు పెద్ద సంఖ్య చెల్లించకుండా పెండింగ్ ఉన్నాయి.. కోవిడ్ కారణంగా వెహికల్స్ ఓనర్స్ పెండింగ్ చలాన్లు చెల్లించపోయారు. కొన్ని వెహికల్స్ పై వాటి వ్యాల్యూ కంటే ఎక్కువ మొత్తం లో చలాన్లు ఉన్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్ పరిధిలోని మూడు కమిషనరేట్లతోపాటు తెలంగాణ వ్యాప్తంగా వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లపై రాయితీని ప్రకటించింది. టూవీలర్స్,త్రీ వీలర్స్ పై 80 శాతం, టీఎస్ ఆర్టీసీ బస్సులపై 90 శాతం, 60 శాతం లైట్ వెయిట్ లేదా హెవీ వెయిట్ మోటార్ వెహికల్స్, కార్లపై 60 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. టూవీలర్స్, త్రీ వీలర్స్ 80 శాతం, టీఎస్పై ఆర్టీసీ బస్సులపై 90 శాతం, లైట్ వెయిట్ వెహికల్స్ , హెవీ వెయిట్ వెహికల్స్, కార్లపై 60 శాతం రాయితీని ప్రకటించాఉ.

## దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న మోడీ

(మొదటి పేజి తరువాయి) పెంపుడు కుక్కల్లా తయారు చేశారు. ఇండియా పేరు చూసి మోదీ ప్రభుత్వం భయపడుతోందన్నారు. మంగళవారం నాడు సీపీఐ కార్యాలయంలో సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు, నారాయణ, చాడా వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ... బీజేపీ ప్రమాదకర సిద్దాంతాలతో, ఆలోచనలతో దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నం చేస్తోంది. అయోధ్య రామమందిరానికి నాంది పలికింది ఎల్కే అద్వానీ.. కానీ అదే ఆద్వానిని రామ మందిర ప్రారొంభోత్సవానికి రావొద్దని చెప్పారు. బీజేపీ మోస్ట్ క్రిమినల్ గవర్నమెంట్. క్రిమినల్ గ్యాంగ్, మోదీ, అమిత్ షా, క్రిమినల్ గ్యాంగ్ దేశాన్ని పరిపాలిస్తోంది.



దేశ సంపదను ఆదానీ చేతికి అప్పగించారు. లెఫ్ట్ వింగ్ ప్రమాదకరమని చెబుతున్నారు. ఉప చట్టాలను మరింత ప్రమాదకరనీగా తయారుచేస్తున్నారు. దేశానికి రైట్ వింగ్ ప్రమాదకరమా..? లెఫ్ట్ వింగ్ ప్రమాదకరమా అనేది తెల్సుకోవాల్సిన అవసరం ఉందని నారాయణ తెలిపారు. విద్యా వ్యవస్థను పూర్తిగా కాషాయ మయం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పార్లమెంట్‌పై దాడి జరిగింది. దాడి చేసిన వారికి బీజేపీ ఎంపీ పాసులు ఎట్లా ఇచ్చారు..? పాసులిచ్చిన బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోకుండా నిరసన తెలిపిన సభ్యులను సస్పెండ్ చేశారు. పై స్థాయిలో బిల్లులను అమోదించు కోవడానికి పార్లమెంట్‌పై దాడికి ఎ÷-లాన్ చేసుకున్నారు. దేశాన్ని కాపాడుకోవాలంటే రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి మోదీ ప్రజాస్వామ్యాన్ని తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.. కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వ కార్డు ప్రపంచంలో ఎక్కడికెళ్లినా గుర్తింపు ఉంటుందని నారాయణ పేర్కొన్నారు. 1917కు ముందు విశ్వంలో ఒకే గ్లోబ్ ఉండేది. 1917 సోవియట్ విప్లవం వచ్చిన తర్వాత విశ్వంలో ఒక ఎర్ర చుక్క పొడిచింది. సోవియట్ విప్లవం ఒక గుణాత్మకమైన మార్పు. బ్రిటిష్ దొరలను తరమాలని అనుకున్నారు తప్ప ఎలాంటి స్వాతంత్య్రం కావాలని ఎవరు అనుకోలేదు. దేశంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆవిర్భవించిన తర్వాతే స్పష్టమైన స్వాతంత్య్ర రాజ్యాంగ దేశం ఏర్పడింది. వారసత్వ ఉద్యమం స్ఫూర్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉంది. దేశ స్వాతంత్య్రలో కమ్యూనిస్ట్ పార్టీ వేలాదిమంది అమరవీరులను పోగొట్టుకుంది. స్వాతంత్య పోరాటంలో బీజేపీ పార్టీ పాత్ర లేదు. కులాలు, మతాల పేరు మీద దేశం విచ్ఛిన్నం అయ్యే ప్రమాదం ఉంది. ఈరోజు దేశం విచ్ఛిన్ననీ చేసేందుకు విభజించు పాలించు అనే పద్ధతిలో పాలక గణాలు, ప్రభుత్వాలు ఉన్నాయి. దేశం ఐక్యంగా ఉండాలి. భిన్నత్వంలో ఏకత్వంలా దేశం బలంగా ఉండాలి. దున్నే వాడికి భూమి కావాలనే ఉద్యమం నుంచి సాయుధ పోరాటంతో వరకు దేశంలో కమ్యూనిస్ట్ పార్టీ అనేక నిర్బాంధాలను ఎదుర్కొన్నదని నారాయణ తెలిపారు. విశ్వం ఉన్నంత వరకు ఎర్ర జెండా ఉంటుందని సీపీఐ తెలంగాణ కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు భారత కమ్యూనిస్ట్ పార్టీ 99వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కమ్యూనిస్ట్ మేనిఫెస్టో ప్రకటించుకున్న రోజు అనేక బలిదానాలను, అనేక త్యాగాలను ఎదుర్కొని 99 ఏళ్లుగా ముందుకు నడుస్తున్నానీ. 1849 కార్ల్‌మార్క్స్ కమ్యూనిస్ట్ మేనిఫెస్టో రూపొందించారని కూనంనేని సాంబశివరావు తెలిపారు. రష్యా విప్లవం ప్రపంచానికి ఒక మార్గదర్శకాన్ని ఇచ్చింది. బలం ఉన్నోడిదే రాజ్యం కాదు.. శ్రమ పడ్డోడిదే రాజ్యమని కార్ల్‌మార్క్స్ నూతన మార్గాన్ని సూచించారు. ఆ పునాదుల మీదే భారతంలో సీపీఐ ఉద్భవించింది. కమ్యూనిస్ట్ పార్టీ ఉద్భవించిన తర్వాతే అనేక చట్టాలు, సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. దేశంలో ఔట్ సోర్సింగ్ పేరుతో కార్మికుల శ్రమను దోచుకుంటున్నారు. కోట్లాది మంది పేదరికంతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. పాలకుల ప్యారమిటర్స్ పేపర్ల వరకే పరిమితమవుతున్నాయి. ఎర్రజెండా పార్టీ నుంచి ఒక్క ఎమ్మెల్యేని తెలంగాణలో గెలిచాను. రోజుకొక పార్టీ మారే హీనులు కమ్యూనిస్టుల పార్టీలపై అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారు. 99 ఏళ్లలోకి అడుగు పెట్టాం. ఏడాది పాటు కమ్యూనిస్ట్ ఉత్సవాలు జరుకుంటామని కూనంనేని సాంబశివరావు ప్రకటించారు.

## భారత వాణిజ్య నౌకలపై దాడిని ఉపేక్షించం




(మొదటి పేజి తరువాయి) నౌకాదళంలో ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి ఈమేరకు మాట్లాడారు. భారత్‌కు వస్తున్న వాణిజ్య నౌకలపై వరుస డ్రోన్ దాడులు జరుగుతుండటంపై రాజ్‌నాథ్ సింగ్ సీరియస్ అయ్యారు. దాడులకు పాల్పడిన వారిని సముద్రంలో దాక్కునా వేటాడి మరీ పట్టుకుంటామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాణిజ్య నౌకలు ఎంవీ కెమ్ ప్లూటో , ఎంవీ సాయి బాబా లపై ఇటీవల జరిగిన దాడులను భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పారు. సముద్ర జలాల్లో గస్తీని ముమ్మరం చేసినట్టు తెలిపారు. ఈ నెల 23న గుజరాత్ తీరంలోని అరేబియా సముద్రంలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌక 'ఎంపీ కెమ్ ప్లూటో'పై డ్రోన్ దాడి జరగడం సంచలనమైంది. 21 మంది భారత నౌకా సిబ్బందితో ఉన్న ఈ నౌక పోర్‌బందర్‌కు 217 నాటికల్ మైల్స్ దూరంలో ఆగిపోవడంతో భారత నౌకాదళం వెంటనే సహాయక కార్యక్రమాలు చేపట్టింది. ఐసీజీఎస్ విక్రమ్ రక్షణలో ఆ నౌకను ముంబై పోర్టుకు చేరింది. ఈ దాడి ఇరాక్ భూభాగం నుంచి జరిగిందని అమెరికా రక్షణ శాఖకు చెందిన పెంటగాన్ సంచలన ప్రకటన చేయగా, దీనిని ఇరాక్ ఖండించిది. దీనికి ముందు ఎంవీ సాయిబాబా వాణిజ్య నౌకపై కూడా దాడి జరిగింది. కాగా, మర్చెంట్ షిప్‌లపై కౌంటర్ పైరసీ, డ్రోన్ దాడులను తిప్పికొట్టేందుకు నాలుగు డిస్ట్రాయర్లను మోహరించినట్టు నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.రవికుమార్ తెలిపారు. గుజరాత్ తీరానికి సమీపంలో అరేబియా సముద్రంలో ప్రయాణిస్తోన్న వాణిజ్య నౌక 'ఎంవీ కెమ్ ప్లూటో'పై డిసెంబర్ 23న డ్రోన్ దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సమాచారం అందుకున్న భారత నౌకాదళం వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. 'ఐసీజీఎస్ విక్రమ్' రక్షణలో ఆ వాణిజ్య నౌక ముంబయి పోర్టు ప్రాంతానికి చేరుకుంది. ఈ దాడి ఇరాన్ భూభాగంపై నుంచే జరిగిందని అమెరికా రక్షణశాఖకు చెందిన పెంటగాన్ వెల్లడించింది. అయితే, అమెరికా ఆరోపణను ఇరాన్ ఖండించింది. అంతకుముందు 'ఎంవీ సాయిబాబా'పైనా దాడి జరిగింది. ఈ పరిణామాల నడుమ భారత హెచ్చరికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



## తెలంగాణలో నేడే సింగరేణి ఎన్నికలు

(మొదటి పేజి తరువాయి) ఎన్నికల కారణంగా వాయిదా పడింది. ఈనెల 27న పోలింగ్ నిర్వహించాల్సిందేనని హైకోర్టు ఆదేశించడంతో ప్రస్తుతం ఎన్నికలు జగనున్నాయి. సింగరేణి పరిధిలో 24 భూగర్భ, 18 ఓపెన్ కాస్ట్ గనులు ఉన్నాయి. 1998 నుంచి కార్మిక సంఘం ఎన్నికలు జరుగుతున్నాయి. గుర్తింపు సంఘం కాలపరిమితి నాలుగు సంవత్సరాలు. సింగరేణి గుర్తింపు సంఘాల ఎన్నికల్లో 13 యూనియన్లు పోటీ పడుతున్నా, కాంగ్రెస్, సీపీఐ, బీఆర్ఎస్ అనుబంధ యూనియన్ల మధ్యే ఉండనుంది. బీఆర్ఎస్ అనుబంధ సంఘమైన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పోటీ చేయొద్దని కేసీఆర్ ఆదేశించారు. దీంతో ప్రచారం కూడా ఆశించిన స్థాయిలో చేయలేదు. గుర్తింపు సంఘానికి ముగ్గురు ముఖ్య నేతలు రాజీనామా చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో సింగరేణిలో టీజీబీకేఎస్ బలపడింది. 2012, 2017 కార్మిక సంఘం ఎన్నికల్లో విజయం సాధించింది. 2017లో ఏకంగా టీజీబీకేఎస్ తొమ్మిది ఏరియాల్లో సత్తా చాటింది. ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ మందమర్రి, భూపాలపల్లి ఏరియాల్లోనే గెలుపొందింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో, ఈ ఎన్నికలపై ఆసక్తి పెంచింది. గత ఎన్నికల్లో పోటీ చేయని ఐఎన్‌టీయూసీ, మెజారిటీ ఏరియాలను గెలుపొందడానికి వ్యూహాలు అమలుచేస్తోంది. తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలిగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యవహరిస్తున్నారు. ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడిగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఉన్నారు. ప్రస్తుతం సింగరేణి ఎన్నికలు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ పార్టీ వరాల జల్లు కురిపించింది. కార్మికులకు ఇంటి స్థలం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇస్తామని ప్రకటించింది. కార్మికుల సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ వేస్తామని హామీ ఇచ్చింది. కారుణ్య నియామకాలు చేపడతామని, సింగరేణి దినోత్సవాన్ని సెలవుగా ప్రకటిస్తామని హామీ ఇచ్చింది. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని, కార్మికుల వైద్యానికి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మిస్తామని చెప్పింది. మహిళా కార్మికులు గని బయటే పని చేసే అవకాశం, కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరిస్తామని వరాలిచ్చింది అధికార కాంగ్రెస్ పార్టీ. సింగరేణి గనులు ఉన్న ప్రాంతాల్లో ఒక్క చోట తప్ప అన్ని చోట్లా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే విజయం సాధించారు.

## ఇటుకబట్టీ కూలి ఆరుగురు దుర్మరణం

రూర్కీ, డిసెంబర్ 26 (సమ సమాజం): ఉత్తరాఖండ్ లోని రూర్కీ లో మంగళవారంనాడు ఘోర విషాదం చోటుచేసుకుంది. లహబోలి గ్రామంలో ఇటుక బట్టీ గోడకూలి బట్టీ ఆరుగురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. పలువురు గాయపడ్డారు. గోడ శిథిలాల కింద చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తెచ్చేందుకు సహాయక చర్యలు జరుగుతున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, బట్టీలో ఇటుకలు నింపుతుండగా ఈ ప్రమాదం జరిగింది. వెంటనే స్థానిక యంత్రాంగ, పోలీసులు రంగంలోకి దిగారు. జేసీబీ సాయంతో శిథిలాలను తొలగిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వైద్య సహాయక బృందం కూడా ఘటనా స్థలికి చేరుకుంది.

**Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU***, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
**Printed at *Panidhar PUBLICATIONS.*** Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in